క్లుప్తంగా

5 నుంచి 8 వరకు ఆధార్ క్యాంప్‌లు

వినుకొండ: పట్టణంలోని ఓబయ్యకాలనీలో గల సచివాలయంలో ఆధార్ క్యాంప్‌లు ఈ నెల 5వ తేదీ నుంచి 8వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ సుభాష్‌చంద్రబోస్ తెలిపారు. ప్రతి రోజూ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నూతన ఆధార్‌కార్డుల ఎన్‌రోల్‌చేయుట, బయోమెట్రిక్ అప్‌డేట్ చేయుట, డెమోగ్రాఫిక్ అప్‌డేట్ చేయుట, ఆధార్‌కార్డు, డౌన్‌లోడ్, కలర్ ప్రింట్ చేయుట మొదలైన సర్వీసులను అందిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని పట్టణ ప్రజలు సద్వినియోగించుకోవాలని కోరారు.

కార్మిక హక్కులపై అవగాహన ఉండాలి

మొదటి అదనపు సివిల్ జడ్జి ఎ. సలోమి



నరసరావుపేటటౌన్: కార్మికులు తమ హక్కుల పట్ల అవగాహన కలిగి ఉండాలని మొదటి అదనపు సివిల్ జడ్జి ఎ. సలోమి అన్నారు. మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం ఆర్టీసీ గ్యారేజ్‌లో కార్మికులకు నిర్వహించిన న్యాయవిజ్ఞాన సదస్సులో ఆమె మాట్లాడారు. అసంఘటిత కార్మికులకు చట్టప్రకారం ఉన్న సౌలభ్యాలు, తమ హక్కులు, ఉచిత న్యాయసహాయం పొందే విధి విధానాలను వివరించారు. ఎంప్లాయి, ఎంప్లాయర్ వివాదాలు తదితర అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ వంశీకృష్ణ, ప్యానల్ న్యాయవాదులు, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

రేపటి నుంచి ఉచిత కరాటే శిక్షణ శిబిరం

నరసరావుపేట ఈస్ట్: బరంపేటలోని శ్రీరామ కృష్ణ ఓరియంటల్ పాఠశాలలో ఈనెల 5వతేది నుంచి జూన్ 5వతేదీ వరకు ఉచిత కరాటే శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్లు రొటేరియన్ వనమా పవన్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రోటరాక్ట్ క్లబ్ ఆఫ్ నరసరావుపేట ఫీనిక్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న శిబిరంలో ప్రతిరోజు ఉదయం 6గంటల నుంచి 8గంటల వరకు కరాటే, జూడో క్రీడల్లో శిక్షణ ఉంటుందని వివరించారు. కరాటే, జూడో సీనియర్ కోచ్ శివరాత్రి శిరీష శిబిరంలో శిక్షణ ఇస్తారని తెలిపారు. ఆరోగ్యంతో పాటు క్రమ శిక్షణ, ఆత్మరక్షణకు యుద్ధ క్రీడలు ఉపయోగపడతాయన్నారు. వేసవి సెలవులను సద్వినియోగం చేసుకుంటూ చిన్నారులు శిబిరంలో చేరాలని కోరారు. శిక్షణా శిబిరంలో 75మంది వరకే అవకాశం ఉంటుందని, పేర్లు నమోదుకు 8897020595, 9951706583 నెంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

యువకుడు ఆత్మహత్య

చిలకలూరిపేటటౌన్: యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన పట్టణంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... పట్టణంలోని టిడ్కో గృహాల్లో నివాసం ఉంటున్న బూదాటి అనిల్‌కుమార్ (24) తాపీ పనులు నిర్వహిస్తుంటాడు. తల్లి చనిపోవడం, తండ్రి విడిచి వెళ్లడంతో అనిల్‌కుమార్, అతని అన్నయ్య శివరాజేష్ ఇద్దరు 52 ఎకరాల్లోని టిడ్కో గృహాల్లోని మూడో అంతస్తుల్లో అమ్మమ్మ చింతక్రింది దేవకిదేవి వద్ద ఉంటున్నారు. ఈ క్రమంలో శుక్రవారం అనిల్‌కుమార్ ప్రేమించానంటూ ఓ వివాహిత మహిళను ఇంటికి తీసుకురావడంతో మనవడిని తిట్టి ఆమెను విడిచిపెట్టి రమ్మంటూ వాగ్వాదం పెట్టుకుంది. దీంతో సదరు మహిళతో వెళ్లి మరునాడు శనివారం ఉదయం తిరిగి ఒంటరిగా ఇంటికి వచ్చాడు. ఇంటి సమీపంలో సరుకులు తెచ్చుకునేందుకు వెళ్లిన అమ్మమ్మ వచ్చి తలుపు తీయబోగా లోపల గడియ పెట్టు ఉండటంతో మనవడు వచ్చి ఉంటాడని గ్రహించి ఎన్నిమార్లు పిలిచినా తీయకపోవడంతో అనుమానంతో పొరుగు వారిని పిలిచింది. తలుపు గడియ పగులకొట్టి చూడగా అనిల్ ఫ్యాన్‌కు ఉరివేసుకుని కనిపించడంతో పోలీసులకు సమాచారం అందించారు. కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

సామాజిక సేవకుడికి పురస్కారం ప్రదానం



సత్తెనపల్లి: సత్తెనపల్లికి చెందిన ప్రముఖ సామాజిక సేవకుడు గంజి వీరాస్వామి 'భారత కీర్తి కిరీటి పుర స్కారం' స్వీకరించారు. రెండున్నర దశాబ్దాలుగా సామాజిక సేవ చేస్తున్నందుకు తెలుగు వెలుగు సాహితీ స్వచ్ఛంద సేవా సంస్థ మే 1వ తేదీన విశాఖపట్నంలో ఈ పురస్కారం ప్రదానం చేసింది. ఈ సందర్భంగా పట్టణ ప్రముఖులు కట్టా శివ దుర్గారావు, వంగర మధు, వంగర శ్రీనివాసరావు, అవ్వారు ఏడుకొండలు శనివారం గంజి వీరాస్వామికి అభినందనలు తెలిపారు. ఆయన సేవా నిరతిని ప్రశంసించారు. ముందు ఇలాంటి పురస్కారాలు అందుకోవాలని ఆకాంక్షించారు. ఈ గౌరవాన్ని అందించిన తెలుగు వెలుగు సాహితీ స్వచ్ఛంద సేవా సంస్థకు వీరాస్వామి కృతజ్ఞతలు తెలిపారు.

వేలాడుతున్న యమపాశాలు!!

ఆ గ్రామస్తులకు ఇళ్లముందున్న విద్యుత్ తీగలు యమపాశాలుగా కనిపిస్తున్నాయి. ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియనిస్థితిలో వారు జీవనం గడుపుతున్నారు. ఏ కరెంటు తీగ తమ ప్రాణాలు హరిస్తుందో.. ఏ విద్యుత్ స్తంభం కూలి నెత్తినపడుతుందో తెలియక క్షణక్షణం భయం భయంగా కాలం వెళ్లదీస్తున్నారు. బొల్లాపల్లి మండలంలో పలువురు గ్రామస్తులు పడుతున్న విద్యుత్ కష్టాలను ఓమారు పరిశీలన చేస్తే....

- దశాబ్దాల నాడు ఏర్పాటు చేసిన కరెంటు తీగలు
- ఎప్పుడు విరిగిపడతాయో తెలియని స్తంభాలు
- పలు గ్రామాల్లో విద్యుత్ వెతలు!



బొల్లాపల్లిలో నివాస గృహాలకు అడ్డంగా ఉన్న కరెంటు పోల్స్, తీగలు



రేమిడిచర్లలో కిందకు వేలాడుతున్న కరెంటు తీగలు

బొల్లాపల్లి: చేతికి అందేంత ఎత్తులో కిందకు వేలాడుతున్న విద్యుత్ తీగలు.. ఎప్పుడు విరిగి పడతాయో తెలియని విద్యుత్ స్తంభాలు.. ఇది బొల్లాపల్లి మండలంలోని పలు గ్రామాల్లో నెలకొన్న విద్యుత్ సమస్యల తీరు. మండలంలో రేమిడిచర్ల బొల్లాపల్లి రెండు సెక్షన్ల పరిధిలోని పలు గ్రామాల్లో దశాబ్దాల క్రితం విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేశారు. అప్పుడున్న పరిస్థితుల నేపథ్యంలో ఏర్పాటు చేసిన ఈ స్తంభాల తీగలు ఇవాళ చేతికి అందేంత ఎత్తుకు వచ్చి చేరాయి. ఎవరైనా పొరపాటున వాటిని తాకితే వారికదే చివరి రోజు.

అడ్డదిడ్డంగా తీగల నిర్మాణం

పలుచోట్ల నివాస గృహాల వద్ద విద్యుత్ తీగలు, స్తంభాలు అడ్డంగా ఉండటంతో గృహ నిర్మాణాలకు ప్రమాదం పొంచి ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రేమిడిచర్ల హైస్కూల్ తరగతి గదులపై నుంచి విద్యుత్ లైన్ వెళ్తోంది. పలు ప్రదేశాల్లో నివాస గృహాలకు అడ్డంగా విద్యుత్ స్తంభాలు ఉన్నాయి. వీటిని తొలగించాలని పలుమార్లు అధికారులకు మొరపెట్టుకున్నా ప్రయోజనం లేదని స్థానికులు వాపోతున్నారు. మండల కేంద్రం బొల్లాపల్లిలోని పాటీ మీద కాలనీలో ఎన్నో ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాలతో ఇల్లు నిర్మాణానికి అడ్డంకులు ఆటంకంగా ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై పలుమార్లు బొల్లాపల్లి సెక్షన్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకున్న దాఖలాలు లేవని స్థానికులు వాపోతున్నారు. పలు గ్రామాల్లో విద్యుత్ లైన్లు మరమ్మతులు చేయాలని ఆయా పంచాయతీలు తీర్మానాలు సైతం చేసినప్పటికీ స్థానిక అధికారుల్లో చలనం లేదని గగ్గోలు పెడుతున్నారు. మండలంలో నెలకొన్న కరెంటు సమస్యలపై ఉన్నతాధికారులు దృష్టిసారించి సమస్యలను పరిష్కరించాలని వారంతా ముక్తకంఠంతో కోరుతున్నారు.

కుప్పలు తెప్పలుగా సమస్యలు



మండలంలో కరెంటు సమస్యలు కుప్పలు తెప్పలుగా ఉన్నాయి. దశాబ్దాల క్రితం ఏర్పాటు చేసిన విద్యుత్ లైన్లతో ఇబ్బందులు పడుతున్నాం. గ్రామంలో చేతికి అందే ఎత్తులో కరెంటు తీగలున్నాయి. గాలులు వీస్తే విరిగిపడి పోయే స్తంభాలు కూడా మా మధ్యనే ఉన్నాయి. పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ప్రయోజనం లేదు. ఎవరూ పట్టించుకోవడం లేదు.

-వి.బ్రహ్మనాయక్

కుటుంబ సభ్యులతో పారిశుద్ధ్య కార్మికుల ఆందోళన

45వ రోజుకు చేరిన కార్మికుల ఆందోళన



కుటుంబ సభ్యులు, పిల్లలతో నినాదాలు చేస్తున్న కార్మికులు

నరసరావుపేట: తమకు పూర్తివేతనం రూ.21 వేలు చెల్లించాలని కోరుతూ 45 రోజులుగా ఆందోళన చేస్తున్నా అధికారుల నుంచి స్పందన రాకపోవటంతో శనివారం తమ పిల్లలతో కలిసి మున్సిపల్ కార్మికులు ఆందోళనకు దిగారు. వీరికి ఎంఐఎం, దేశభక్త ప్రజాతంత్ర ఉద్యమం (పీడీఎం) నాయకులు శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు.

కార్మికుల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ నాయకులు శిలార్ మసూద్ అధికారులను కోరారు. కార్యక్రమంలో ఎంఐఎం నాయకుడు షేక్ మౌలాలి, పీడీఎం నాయకులు జి.రామకృష్ణ, సీఐటీయూ నాయకుడు సాల్మన్ పాల్గొన్నారు.

దాడి చేసిన వారిపై కేసు నమోదుకు డిమాండ్



ఎమ్మార్పీస్ నాయకులతో కలిసి డీఎస్పీకి వినతిపత్రం అందిస్తున్న బాధితుడు

అమరావతి: మండల పరిధిలోని లింగాపురంలో మాదిగ కులానికి చెందిన కంభంపాటి విద్యాధర్ కుటుంబంపై దాడి చేసిన వారిపై వెంటనే కేసు నమోదు చేయాలని ఎమ్మార్పీఎస్ ఉమ్మడి గుంటూరు జిల్లాల అధ్యక్షుడు చింతిరాల మీరయ్య డిమాండ్ చేశారు. శనివారం సత్తెనపల్లి డీఎస్పీ ఎం.హనుమంతరావుకు వినతిపత్రం సమర్పించిన అనంతరం ఆయన మాట్లాడుతూ.. నిందితులైన అదే గ్రామానికి చెందిన వారిపై కేసు నమోదు చేయకపోవటం దారుణమన్నారు. ఏప్రిల్ 26వ తేదీన జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగిన ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక ప్రజా సమస్యల పరిష్కార వేదికలోనూ కలెక్టర్‌కు దీనిపై అర్జీ ఇచ్చామన్నారు. అడిషనల్ ఎస్పీ సంతోష్‌కు జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశాలు జారీ చేసినా ఇంతవరకు కార్యరూపం దాల్చలేదన్నారు. ఇప్పటికైనా కేసు నమోదు చేసి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో బాధితుడు విద్యాధర్, దళిత బహుజన సంక్షేమ సేవా సంఘం వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు కుక్కమూడి ప్రసాద్, ఎమ్మార్పీఎస్ ప్రతినిధులు కర్లపూడి ప్రశాంత్, నూనె బాబురావు, కలకోటి ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

పని ప్రదేశాలలో ప్రథమ చికిత్స కిట్లు ఉంచాలి



కూలీలతో మాట్లాడుతున్న రవికుమార్

అచ్చంపేట: ఉపాధి హామీ పనులు జరిగే ప్రదేశాలలో తప్పనిసరిగా ప్రథమ చికిత్స కిట్స్, తాగు నీళ్లు, షేడ్ నెట్స్ అందుబాటులో ఉంచాలని పల్నాడు జిల్లా కార్మిక సంఘం కార్యదర్శి గంజిమాల రవికుమార్ తెలిపారు. మండలంలోని చెరుకుంపాలెంలో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూలీలను సంఘాలుగా రిజిస్ట్రేషన్ చేసి మేస్త్రీలకు ప్రత్యేక అలవెన్సులు ఇవ్వాలన్నారు. తీసిన ఫొటోలు గ్రూపుల వారికి అప్‌లోడ్ చేయాలన్నారు. ప్రతి పనికి వర్క్ ఐడీ ఇవ్వాలని, అన్ని పనులకు ఒకే వర్క్ ఐడీ ఇవ్వడం వల్ల కూలీలు నష్టపోతారని చెప్పారు. ప్రతి కూలీకి 150 రోజులు పని చూపించాలని, రోజువారీ వేతనం ప్రతి ఒక్కరికి రూ.350కు తగ్గకుండా ఇవ్వాలన్నారు. మేట్లకు ప్రత్యేక అలెవెన్స్‌లు కేటాయించాలన్నారు. కార్మికులందరూ ఐక్యంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి రావెళ్ల వెంకటేశ్వర్లు, ఉపాధి పథకం మేట్లు పాల్గొన్నారు.

జిగురు అట్టల వాడకంపై అవగాహన

మాదల (ముప్పాళ్ళ): మండలంలోని మాదల గ్రామంలో ఆచార్య ఎన్జీ రంగా విశ్వవిద్యాలయం, బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థినులు గ్రామీణ కృషి అనుభవం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇందులో భాగంగా శనివారం జిగురు అట్టల వాడకంపై అవగాహన కల్పించారు. మిరప తోటలో జిగురు అట్టల ప్రాముఖ్యతను వివరించారు. తెల్లతెగులు, తామర పురుగులను ఆకర్షించి పట్టుకునేలా ఇవి పనిచేస్తాయని చెప్పారు. రసాయన మందులు వినియోగాన్ని తగ్గించడంలో ఎంతగానో దోహదపడతాయని వివరించారు. అమర్చే తీరుపైనా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో విద్యార్థినులు టి.రేణుక, జె.సుమలి, కేవీ కృష్ణవేణి, బి.వర్షిణి స్వరాజ్, రైతులు పాల్గొన్నారు.

దంత సంరక్షణతో ఆరోగ్య రక్ష



పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ ఎం రాజశేఖర్

చిలకలూరిపేట: దంత సంరక్షణతోనే ఆరోగ్య రక్షణ సాధ్యమౌతుందని ప్రముఖ దంతవైద్యులు డాక్టర్ మరకొండ రాజశేఖర్ చెప్పారు. ఇన్నర్‌వీల్ క్లబ్ ఆఫ్ చిలకలూరిపేట ఆధ్వర్యంలో అసిస్ట్ సేవా సంస్థకు చెందిన వృద్ధాశ్రమంలో శనివారం ఉచిత దంతవైద్య శిబిరాన్ని విష్ణు డెంటల్ ఆసుపత్రి సౌజన్యంతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నోటిని పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా పలు వ్యాధులు రాకుండా నియంత్రించవచ్చన్నారు. క్లబ్ అధ్యక్షురాలు గట్టు సరోజిని మాట్లాడుతూ క్లబ్ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. భవిష్యత్తులోనూ వృద్ధులకు అందించే సేవా కార్యక్రమాలు విస్తృతం చేస్తామన్నారు. వృద్ధులకు టూత్ పేస్టులు, బ్రెష్‌లు, పండ్లు ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో అసిస్ట్ సంస్థ డైరెక్టర్ డాక్టర్ జాష్టి రంగారావు, జాష్టి విష్ణుప్రియ, తియ్యగూర రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

మద్యానికి డబ్బులివ్వలేదంటూ మిత్రుడిపై దాడి

చిలకలూరిపేటటౌన్: మద్యంకు డబ్బులివ్వలేదని మిత్రుడిపై దాడి చేసిన ఘటన పట్టణంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని సుగాలీ కాలనీకి చెందిన పెయింటర్ అంబటి గౌతమ్, కొండా నాయక్ మిత్రులు. అయితే శుక్రవారం సాయంత్రం కాలనీలోని ఓ కిరాణ దుకాణం వద్ద గౌతమ్ కూల్‌డ్రింక్ తాగుతుండగా, అదే సమయంలో కొండా నాయక్ అక్కడికి వచ్చారు. తనకు మద్యం తాగేందుకు డబ్బులు ఇవ్వాలని గౌతమ్‌ను అడిగాడు. అయితే అందుకు గౌతమ్ నిరాకరించడంతో కొండా నాయక్ జేబుల్ని తడిమే ప్రయత్నం చేశాడు. దీంతో గౌతమ్ అతన్ని నెట్టివేయడంతో కొపగించుకున్న కొండానాయక్ ఖాళీ బాటిల్‌తో మిత్రుడిపై దాడి చేశాడు. తీవ్ర గాయాలైన గౌతమ్‌ను స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్సలు చేసి మెరుగైన చికిత్సలు నిమిత్తం గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నాడు.


బంగారం చోరీకి పాల్పడిన వ్యక్తి అరెస్ట్



నిందితుడి అరెస్ట్ వివరాలు వెల్లడిస్తున్న రైల్వే పోలీసులు

దాచేపల్లి: మహిళ ప్రయాణికురాలి నుంచి బంగారం చోరీ చేసిన వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు జీఆర్పీ ఎస్ఐ వి.శ్రీనివాసరావు తెలిపారు. నడికుడి రైల్వేస్టేషన్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఈ నెల 2వ తేదీ తెల్లవారుజామున లింగపల్లి నుంచి కాకినాడ వెళ్లే ఎక్స్‌ప్రెస్ రైలు క్రాసింగ్ నిమిత్తం సిరిపురం రైల్వేస్టేషన్‌లో ఆగింది. రైలు బోగిలో ఉన్న ఓ మహిళ ప్రయాణికురాల మెడలో నుంచి బంగారం గొలుసు గుంటూరు శ్యామలనగర్‌కి చెందిన గుర్రప్పాడు రాయప్ప చోరీ చేశాడు. బాధిత ప్రయాణికురాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిందితుడిని నడికుడి రైల్వేస్టేషన్ సమీపంలో తిరుగుతుండగా అరెస్ట్ చేసినట్లు వివరించారు. రైల్వేకోర్టులో నిందితుడిని హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించినట్లు ఎస్ఐ శ్రీనివాసరావు చెప్పారు. సమావేశంలో ఆర్పీఎఫ్ ఎస్ఐ క్రీస్తుదాస్, రైటర్ సరికొండ రామారాజు, కానిస్టేబుల్ కిషోర్ పాల్గొన్నారు.

అందుబాటులోకి ఈత, స్కేటింగ్ వసతులు



సత్తెనపల్లి: ఈత, స్కేటింగ్ వసతులు సత్తెనపల్లిలో అందుబాటులోకి రావడం సంతోషదాయకమని డీఎస్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ దరువూరి నాగేశ్వరరావు అన్నారు. పట్టణంలోని పీఎం రెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఆర్‌కే స్కేటింగ్ కోర్ట్‌ను శనివారం రాత్రి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వేసవి సెలవులలో విద్యార్థులకు అటవిడుపుగా క్రీడలు దోహద పడతాయన్నారు. ఆరోగ్యమే మహాభాగ్యమని గుర్తు చేశారు. ఇతర ప్రాంతాలకు వెళ్లకుండానే స్థానికంగా అందరికీ అందుబాటులో వసతులు రావడంతో ఎక్కువమంది నేర్చుకుంటారన్నారు. ఈ అవకాశాన్ని స్థానిక యువత, విద్యార్థులు ఉపయోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో స్కేటింగ్ ఇన్‌చార్జి ఖాజా, పూల్‌ప్లాజా నిర్వాహకులు చంద్రశేఖర్, విజయ్, చందు, వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలి

- ఏపీ మిడ్‌లెవెల్ హెల్త్ ప్రొవైడర్స్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ అసోసియేషన్ (ఏపీఎంసీఏ) జిల్లా అధ్యక్షురాలు అనుపమ
- ఆరో రోజుకు చేరిన వైద్య సిబ్బంది సమ్మె

నరసరావుపేట: తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఏపీ మిడ్‌లెవెల్ హెల్త్ ప్రొవైడర్స్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ అసోసియేషన్ (ఏపీఎంసీఏ) జిల్లా అధ్యక్షురాలు ఎం.అనుపమ ప్రభుత్వాన్ని కోరారు. తమను రెగ్యులర్ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ స్టేషన్‌రోడ్డులోని గాంధీపార్కుకు ఎదురుగా గత సోమవారం నుంచి కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు (సీహెచ్‌వో) చేస్తున్న సమ్మె శనివారంతో ఆరో రోజుకు చేరింది. అనుపమ మాట్లాడుతూ జిల్లాలో తాము 361 మందిమి ఆయుష్మాన్ భవన్, రాష్ట్ర వైద్యఆరోగ కుటుంబ సంక్షేమ శాఖల కింద విలేజ్ క్లినిక్స్‌లో సీహెచ్‌వోగా పనిచేస్తున్నామన్నారు. తాము పనిచేస్తున్న హెల్త్ సెంటర్లను మూసేసి తాము సమ్మెలో పాల్గొంటున్నామన్నారు. ఉపాధ్యక్షులు కె.వినోద్, జిల్లా కో ఆర్డినేటర్ బి.సాగర్, ప్రధాన కార్యదర్శి రాము మాట్లాడుతూ తామందరమూ ఆరేళ్ల నుంచి కాంట్రాక్ట్ ఉద్యోగులుగా చేస్తున్నామని, నిబంధనల ప్రకారం తమను పర్మినెంట్ ఉద్యోగులుగా గుర్తించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందన్నారు. తమకు 23 శాతం వేతన సవరణ చేయాలని, క్లినిక్స్ అద్దె బకాయిలను వెంటనే చెల్లించి క్రమబ ద్ధీకరించాలని, నిర్దిష్టమైన జాబ్‌చార్టు అందజేయాలని, ఎఫ్ఆర్ఎస్ నుంచి సీహెచ్‌వోలకు మినహాయింపు ఇవ్వాలని, హెచ్ఆర్ పాలసీ, ఇంక్రిమెంట్లు, ట్రాన్స్‌ఫర్స్, ఎక్స్‌గ్రేషియా, పితృత్వ సెలవులు అమలుచేయాలని డిమాండ్ చేశారు. పలువురు సీహెచ్‌వోలు పాల్గొన్నారు.

ఘనంగా ఏఐవైఎఫ్ 66వ ఆవిర్భావ దినోత్సవం



వేడుకల్లో పాల్గొన్న నాయకులు

వినుకొండ: పట్టణంలోని శివయ్యస్థూపం సెంటర్ వద్ద ఏఐవైఎఫ్ 66వ ఆవిర్భావ దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏరియా కార్యదర్శి దారివేముల మరియబాబు ఏఐవైఎఫ్ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దాదాపు 12 సంవత్సరాలు అధికారంలో ఉన్న నరేంద్రమోదీ యువతను మోసం చేశారన్నారు. సంవత్సరానికి 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తానని చెప్పి ఇప్పటికీ ఆ వాగ్దానాన్ని నెరవేర్చలేదన్నారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 2.38 లక్షల ఉద్యోగాల భర్తీకి కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చి అధికారంలోకి రాగానే గాలికి వదిలేశారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే హామీలను నెరవేర్చాలని, లేకపోతే ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాయకులు సలోమి, పద్మ, మస్తాన్, మీరావలి, సుభాని, మల్లికార్జున, రవి, సాంబయ్య పాల్గొన్నారు.

మత చాందసానికి వ్యతిరేకంగా యువత పోరాడాలి

ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి షేక్ సుభాని



ఏఐవైఎఫ్ పతాకం ఆవిష్కరిస్తున్న షేక్ సుభాని, తాళ్లూరి బాబురావు

చిలకలూరిపేట: మత చాందస విధానాలకు వ్యతిరేకంగా యువత పోరాడాలని, తీవ్రవాదాన్ని వ్యతిరేకిస్తూ దేశ సమైక్యత, సమగ్రత, సార్వభౌమాధికారాన్ని కాపాడుకుందామని అఖిల భారత యువజన సమాఖ్య రాష్ట్ర సహాయ కార్యదర్శి షేక్ సుభాని చెప్పారు. ఏఐవైఎఫ్ 66వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని సీపీఐ ఏరియా ఇన్‌చార్జి కార్యదర్శి తాళ్లూరి బాబురావుతో కలసి సీపీఐ కార్యాలయంపై ఏఐవైఎఫ్ పతాకాన్ని శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశభవిష్యత్తులో యువత పాత్ర ప్రధానమైనదని, యువతరంలో ప్రగతిశీల, అభ్యుదయ భావాలను, దేశభక్త, లౌకిక, ప్రజాస్వామిక ఆలోచనలను పెంపొందించేందుకు ఏఐవైఎఫ్ కృషి చేస్తోందన్నారు. దేశం కోసం ప్రాణత్యాగం చేసిన భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్, చంద్రశేఖర్ అజాద్, సుభాష్ చంద్రబోస్ వంటి అమరవీరుల వారసత్వం తమదన్నారు. అదే స్ఫూర్తితో అవినీతికి వ్యతిరేకంగా, యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాల కోసం పోరాడాల్సిన అవసరం నేటి యువతకు ఉందన్నారు. యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించటంలో పాలకులు విఫలమయ్యాయని విమర్శించారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పనకు నేషనల్ ఎంప్లాయ్‌మెంట్ గ్యారెంటీ యాక్ట్‌ను రూపొందించి అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాయకులు మల్లిఖార్జున్, రాంబాబునాయక్ పాల్గొన్నారు.

హక్కులను కార్మికులు సద్వినియోగం చేసుకోవాలి

- న్యాయమూర్తి కె. నరేంద్రరెడ్డి
- తిమ్మాపురంలో కార్మికులకు న్యాయ విజ్ఞాన సదస్సు



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) కె. నరేంద్రరెడ్డి

యడ్లపాడు: అసంఘటిత రంగ కార్మికులు ప్రభుత్వం కల్పించిన చట్టబద్ధమైన హక్కులను సద్వినియోగం చేసుకోవాలని మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) కె. నరేంద్రరెడ్డి పిలుపునిచ్చారు. అంతర్జాతీయ కార్మిక వారోత్సవాల సందర్భంగా శనివారం తిమ్మాపురంలోని వసంత నూలుమిల్లులో నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆయన ప్రసంగించారు.

కార్మిక చట్టాలపై అవగాహన కలిగి ఉండటం అవసరమని, ప్రతి కార్మికుడూ పనికి తగ్గ వేతనం పొందే హక్కు కలవాడని తెలిపారు. బాల కార్మికుల నియామకం నిషిద్ధమని, దానికి సంబంధించి ప్రభుత్వం ప్రవేశపెట్టిన చట్టాలను కూడా వివరిస్తూ, అవగాహన కల్పించారు. అలాగే, కార్మికులకు ప్రభుత్వ పథకాల గురించి వివరించి, మండల న్యాయ సేవాధికార సంస్థ ద్వారా ఉచిత న్యాయ సహాయం పొందవచ్చని సూచించారు. చట్ట పరంగా అందుబాటులో ఉన్న అన్ని సేవలను వినియోగించుకోవాలని హితవు పలికారు. కార్యక్రమంలో చిలకలూరిపేట బార్‌అసోసియేషన్ అధ్యక్షుడు జీవీహెచ్ ప్రసాద్, న్యాయవాదులు పి.వెంకటేశ్వరరావు, ఎ.శివరావు, ఏఎస్ఐ వెంగయ్య, హెచ్ఆర్ఎం పుల్లారావు, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ పత్రికా స్వేచ్ఛ దినోత్సవం



ఉగ్రవాదుల దాడుల్ని నిరసిస్తూ నినాదాలు చేస్తున్న దృశ్యం

యడ్లపాడు: మండలంలో శనివారం నరేంద్ర సువర్ణకుమారి ఫౌండేషన్ ఆధ్వర్యంలో జాతీయ పత్రికా స్వేచ్ఛ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఫౌండేషన్ అధ్యక్షురాలు సువర్ణ కుమారి మాట్లాడుతూ సామాజిక, ఆర్థిక, రాజకీయ అంశాలను సమర్థంగా ప్రజల్లోకి తీసుకెళ్తూ, ప్రభుత్వానికి ప్రజల మధ్య బలమైన వారధిగా పాత్రికేయులు వ్యవహరిస్తున్నారు. నిత్యం సమాజ శ్రేయస్సు కోసం శ్రమిస్తున్న పాత్రికేయుల సేవల్ని ప్రతిఒక్కరూ గుర్తించి గౌరవించాలన్నారు. సీనియర్ జర్నలిస్టులు ఎం.రామారావు, వైవీ రమేష్‌బాబు మాట్లాడుతూ, 1991లో విండ్‌హోక్ డిక్లరేషన్ నేపథ్యంలో 1993లో మే 3వ తేదీన ఐక్యరాజ్యసమితి ప్రపంచ పత్రిక స్వేచ్ఛ దినోత్సవంగా ప్రకటించిందని గుర్తు చేశారు. అప్పటి నుంచి ప్రతి సంవత్సరం ఈ దినోత్సవాన్ని ప్రపంచవ్యాప్తంగా జరుపుకుంటున్నామని, పత్రికారంగం ప్రజాస్వామ్య పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తోందని వివరించారు. ముందుగా జర్నలిజంలో ప్రాణాలర్పించిన పాత్రికేయులకు, ఇటీవల కాశ్మీర్ ఘటనలో ఉగ్రవాదుల చేతుల్లో ప్రాణాలు కోల్పోయిన వారికి నివాళి అర్పించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి, ఈ ఘటనపై తమ నిరసనతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో మానుకొండ రామారావు, వైవి రమేష్ బాబు, వైబీవీ శ్రీనివాసరావు, షేక్ హసన్‌వలి, పావులూరి బ్రహ్మానందం, వంకాయలపాటి శ్రీధర్, ఆరుమళ్ల వెంకట్రావు, పోపూరి నాగచౌదరి, సుందరబాబు తదితర జర్నలిస్టులు పాల్గొన్నారు.